ఇసుక సమస్యపై 4న ధర్నాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మేరకు ఉచిత ఇసుక పాలసీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ జిల్లాలోని అన్ని మండలాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇసుక సమస్యల్ని పూర్తిగా మార్చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఉచిత ఇసుక పాలసీ ప్రజలపై భారాలు తగ్గించేలా లేదన్నారు. ఈ ప్రభుత్వంలో కూడా ఇసుక ధర సామాన్య మధ్యతరగతి ప్రజలు భరించలేని విధంగా ఉందన్నారు. ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు ఆచరణలో జరుగుతున్న దానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇప్పటికీ అక్రమంగా ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిపోతోందన్నారు. గత వంద రోజుల్లో మూడుసార్లు ఇసుక పాలసీ గురించి స్వయంగా ముఖ్యమంత్రి సమీక్ష చేసినా, పరిస్థితి మెరుగు కాలేదని ఆయనే ఆవేదన వ్యక్తం చేయడం ఇసుక విధానం ఏ పరిస్థితిలో ఉందన్నదానికి అద్దం పడుతోందన్నారు. ఇసుక ధర పెరగడంతో భవన నిర్మాణం పనులు తగ్గి, ఆ రంగంపై ఆధారపడిన కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొనే పరిస్థితులు వచ్చాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4వ తేదీ జిల్లాలోని అన్ని మండలాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇక కొత్త కిక్కు..!



◆ ప్రయివేటు మద్యం దుకాణాలకు టెండర్

◆ అనంతలో 136... శ్రీ సత్యసాయిలో 87..

◆ 11న లాటరీ ◆ గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ అమలుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు మద్యం దుకాణాలకు 2014 తరహాలో ప్రయివేటు దుకాణాలనే ఏర్పాటు చేయనుంది. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. నాణ్యమైన మద్యం లభించేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యం తీసుకొస్తామని టిడిపి ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా పాత పాలసీలో మార్పులు తీసుకొచ్చింది. ఇక ప్రయివేటుకే మద్యం అమ్మకాలను అప్పగిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

గెజిట్ నోటిఫికేషన్

అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలు, సత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాలకు రెండు జిల్లాల్లోనూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు టెండరు వేయదలుచుకున్న వారు ఒక్కో అప్లికేషన్‌కు రెండు లక్షల రూపాయలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది నాన్ రిఫండబుల్‌గా ఉంటుంది. టెండర్లో ఇంత పెద్దఎత్తున ధరను నిర్ణయించడం గమనార్హం. ఈనెల తొమ్మిదవ తేదీలోపు టెండరులో పాల్గొనే వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో అనంతపురం జిల్లాలోని తొమ్మిది ఎక్సైజ్ పోలీసు స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుంది. ఈనెల 11వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కలెక్టరేట్‌లో లక్కీ డ్రా తీస్తారు. ఈ వచ్చిన వారు ఏడాదికి సుమారు రూ.80 లక్షల వరకు డిపాజిట్ కట్టాల్సి ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో ఈ మద్యం దుకాణం లైసెన్సును మంజూరు చేయనున్నారు.

అప్లికేషన్ ఫీజు అధికమే..

మద్యం దుకాణంలో లైసెన్సు పొందేందుకు దరఖాస్తు చేసుకునే వారు చెల్లించాల్సిన ఫీజు ఏకంగా రెండు లక్షలు పెట్టడంతో లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుందామనుకునే వారి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. అంతకు మునుపు రూ.25 వేలు ఉండేది. ఇప్పుడు ఏకంగా రెండు లక్షల రూపాయలు పెట్టడంతో దరఖాస్తు చేసుకోవాలంటేనే వెనుకడుగు వేసే విధంగా ఉన్నారు. కొద్ది మంది నాయకులు మాత్రం గ్రూపుగా ఏర్పడి ముందుగానే రింగ్ అయ్యేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం. అందరూ దరఖాస్తుకుని ఎవరికొచ్చిన భాగస్వాములు అవుదామన్నట్టుగా మంతనాలు చేసుకునే పనిలో ఉండటం గమనార్హం.

పింఛన్ సొమ్ముతో సర్వేయర్ పరార్

సర్వేయర్‌పై ఫిర్యాదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి-ఉరవకొండ

లబ్ధిదారులకు 1వ తేదీన అందించాల్సిన ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ సొమ్ముతో ఓ సచివాలయ సర్వేయర్ పరారైన ఘటన విడపనకల్లు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... విడపనకల్ మండలం కేంద్రం సచివాలయం-2లో సర్వేయర్‌గా ఇదయతుల్లా విధులు నిర్వహిస్తున్నారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం ఈయనకు అధికారులు రూ.2.52 లక్షలను అందించారు. మంగళవారం ఉదయం 11గంటలైనప్పటికీ ఆయన సచివాలయంకు రాలేదు. అతనికి ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. ఎంతసేపటికి ఆయన ఫోన్ పని చేయకపోవడంతో మండల అడ్మినిస్ట్రేషన్ అధికారి భాస్కర్, ఈవోఆర్డీ సత్యబాబు, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషాలు విడపనకల్ ఎస్ఐ ఖాజా హుస్సేన్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇదయతుల్లా కోసం గాలింపు చేపట్టారు.

లబ్ధిదారులకు పింఛన్లు అందజేత

పింఛన్ సొమ్ముతో సర్వేయర్ ఇదయతుల్లా పారిపోయినా లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో పింఛన్ సొమ్మును సర్దుబాటు చేసుకుని సంబంధిత అధికారులు అందరికీ అందజేశారు.

పంటల సాగులో రైతుకు ప్రోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి-యల్లనూరు

రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పంటల సాగులో రైతుకు ప్రోత్సాహం అందించేలా వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటించి సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పింఛన్ల పంపిణీ, పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపిడిఒ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. బొప్పేపల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ అనుబంధ రంగాల ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు. రైతు మల్లికార్జున నాయుడు పొలంలో దానిమ్మ పంటకు డ్రోన్ ద్వారా మందులను చల్లడాన్ని పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు వ్యవసాయ అధికారులు తెలియజేయాలన్నారు. ఉపాధిలో కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. 3వ తేదీన ఆల్ ఇండియా రేడియో ద్వారా ఉదయం 7:45 గంటల నుంచి 8:15 గంటల వరకు ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఉద్యాన పంటల సాగు, పథకాల గురించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. వాసాపురం గ్రామంలో రైతు శివప్రసాద్ పొలంలో ఫారంపాండ్ పనులను కలెక్టర్ ప్రారంభించారు. భూగర్భ జలాల పెంపునకు ప్రతి రైతు వారి పొలంలో ఫారంపాండ్‌లను తవ్వించుకోవాలని కలెక్టర్ సూచించారు.

చెరువులను నింపండి

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పలువురు రైతులు చెరువులకు నీటి కేటాయింపులపై మాట్లాడారు. సుబ్బరాయ సాగర్ ప్రాజెక్టు నుంచి పుట్లూరు కెనాల్‌కు నీరు విడుదల చేసి యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని ఐదు చెరువులను నింపితే భూగర్భ జలాలు పెరిగి పంటల సాగుకు మరింత ఆస్కారం లభిస్తుందని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ త్వరలో సుబ్బరాయ సాగర్ ప్రాజెక్టును సందర్శించి చెరువులకు నీరు అందించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు.

పింఛన్ల పంపిణీ

యల్లనూరు మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారుల ఇంటి వద్దకు కలెక్టర్ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపిడిఒ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఐఎస్ఒ సర్టిఫికేట్ గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ వీర్రాజుకు సూచించారు. కలెక్టర్ మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజనేయులు, నాయకులు ఆయనకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ, ఏపీడీ శైలజ, ఉద్యానవన శాఖ ఎడి ఉమాదేవి, తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ వీర్రాజు, ఉపాధి హామీ ఏపీడీ వెంకటరత్నం, వ్యవసాయ శాఖ ఏడీఏ చెంగల రాయుడు, ఆర్ఐ నారాయణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై నోరుమెదపండి

◆ రాష్ట్రంలో ప్రధాన పార్టీల వైఖరి దుర్మార్గం ◆ ప్రయివేటీకరణ చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన ◆ విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల హెచ్చరిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేస్తున్న విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల నాయకులు

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ కాకుండా రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేనలు నోరు మెదిపి కేంద్రాన్ని గట్టిగా నిలదీయాలని విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ నిలుపుదల చేసి ప్రభుత్వమే యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరసన దీక్షలను మంగళవారం చేపట్టారు. దీక్షలకు సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్ర కుమార్, రాజారెడ్డిలు మద్దతు తెలిపి మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వాన్ని ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ప్రస్తుత అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఢిల్లీలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని దీక్షలు చేస్తే దాంట్లో పాల్గొని ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప కేంద్రంతో పోరాడిన దాఖలాలు లేవన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంలో భాగ్యసామిగా ఉండి నోరు మెదపకపోవడం విచారకరం అన్నారు. తిరుపతి లడ్డు విషయంలో దీక్షలు చేసే పవన్‌కళ్యాణ్‌కు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు మౌనం వీడి విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రయివేటీకరణపై నోరు మెదపాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఆపకపోతే విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష పోరాటం సాగిస్తామన్నారు. నిరసన దీక్షల్లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర, ఎఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు వేమన, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద్, సంతోష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు, కుళ్లాయిస్వామితో పాటు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి జీవితం ఆదర్శప్రాయం

ప్రజాశక్తి -అనంతపురం

సంస్మరణ సభలో ఎస్‌కెయు రెక్టార్ వెంకటనాయుడు

ఏచూరికి నివాళులర్పిస్తున్న అతిథులు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి జీవితం విద్యార్థులకు ఆదర్శప్రాయమని ఎస్‌కెయు రెక్టార్ వెంకటనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం వర్శిటీలోని పూలే భవన్‌లో ఎస్‌కెయు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మాజీ ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి నాయకులుగా మొదలైన ప్రస్థానం అంచలంచెలుగా ఎదిగిన తీరు నేటి యువతకు విద్యార్థులకు ఆదర్శమన్నారు. సంపన్న కుటుంబంలో జన్మించినా ఐదు దశాబ్దాలుగా పీడిత ప్రజలు, అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి శ్రమించారన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ.చంద్రశేఖర్ ఢిల్లీలోని జెఎన్‌యు విద్యార్థి నాయకులుగా విద్యార్థి సమస్యలే కాకుండా అక్కడ ఉన్న ప్రజల సమస్యల పరిష్కారం, సిటీబస్సుల కోసం కలిసి ఉద్యమించామన్నారు. సిబిఎస్‌సి ఆలిండియా మొదటి ర్యాంకు విద్యార్థి అంటే దేశంలోనే అత్యంత పెద్ద ఉద్యోగాన్ని నిర్వహించేవారని, అలాంటి జీవితాన్ని పేదలకు అంకితం చేసిన యోధుడని కొనియాడారు. అంతేగాకుండా ముక్కుసూటితనం, విద్యార్థి ప్రజా సమస్యలపై ఎలాంటి స్థాయి వ్యక్తులైన నిలదీయడం ఆయనకే సొంతమన్నారు. ఆయన దేహాన్ని సైతం ప్రజాసేవకే అంకితం ఇస్తూ వైద్య విద్యార్థుల కోసం ఢిల్లీలోని ఇన్స్ కళాశాలకు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాస్త్ర విభాగ ప్రొఫెసర్ పుల్లారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, శివారెడ్డి, మోహన్, శాంతిరాజ్, మహేష్, సండే దిల్‌జాన్, రాముడు, చంద్రానాయక్, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, రవి, భరత్, సిరాజ్, హుస్సేన్, ఖాదర్, విద్యార్థులు పాల్గొన్నారు.

'అనంత' రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేవారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండేళ్ల నుంచి రైతులు పంటలు సాగు చేసి నష్టపోతూనే ఉన్నారన్నారు. ఈ ఖరీఫ్ జూన్‌లో వర్షాలు కురవడంతో రైతులు పెద్దఎత్తున రైతులు పంట సాగు చేశారని తెలిపారు. సుమారు 8 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులో ఉన్నాయన్నారు. అయితే జూలై నుంచి ఆగస్టు చివరి వరకూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో 4.50 లక్షల ఎకరాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. రైతులు ఎకరా వేరుశనగ సాగుకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకూ పెట్టుబడి అవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలుస్తూ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా అందించిందని గుర్తు చేశారు. ఖరీఫ్ మొదలవగానే పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకం కింద రూ.13500 అందించేదని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా మార్చినా ఇచ్చిన పాపానపోలేదన్నారు. మరోవైపు 12 వేల విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దాదాపు 4 వేల ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఉందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చి నుంచి ఇవ్వలేదని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇకపోతే జిల్లాలో వర్షాలు లేకపోయినా శ్రీశైలం, తుంగభద్ర ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉందన్నారు. అయితే నీరున్నా తగినరీతిలో తెచ్చుకోలేకపోతున్నామని వాపోయారు. కరువు జిల్లాలో ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి సాగు, తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు.

ఆ పోలీసు రూటే సప'రేటు'

◆ ఆరేళ్లుగా ఒకే స్టేషన్లో తిష్ట

◆ ప్రతి పనిలోనూ కాసుల వ్యవహారమే..!

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న ఓ రెండవ స్థాయి పోలీసు అధికారి తన రూటే సప'రేటు' అన్నట్లుగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఆరేళ్ల క్రితం ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో విధుల్లో చేరిన ఆయన నేటికీ అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. స్టేషన్ ముందు నుంచి వెళ్లే ఏ వాహనం అయినా ఆయనకు కప్పం కట్టనిదే ముందుకు కదలదని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇక ఇసుక ట్రాక్టర్లను ఆదాయ వనరుగా మార్చుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ట్రాక్టర్ల యజమానులు ఆరోపిస్తున్నారు. బెళుగుప్ప మండలం కాలువపల్లి పెన్నానది నుంచి రోజూ పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు జిల్లా కేంద్రానికి వెళ్తుంటాయి. వీటినే ఆయన ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆత్మకూరులో విధుల్లో చేరిన ఆయన అప్పట్లో అదేస్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్, ఓ హోంగార్డుల ద్వారా యథేచ్ఛగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్ల యజమానులను బెదిరించి జిల్లా కేంద్రంలో తాను నిర్మిస్తున్న ఇంటికి యథేచ్ఛగా ఇసుకను తరలించారని సమాచారం. రాత్రి సమయంలో స్టేషన్ ముందు నుంచి వెళ్లే కూరగాయల వాహనాలను సైతం ఆపి డబ్బులు ఇవ్వాలని, లేదంటే కూరగాయలైనా ఇవ్వాల్సిందేనని పీడించి మరీ వసూలు చేస్తారని వాహన యజమానులు వాపోతున్నారు. ఆరు నెలల క్రితం తపోవనానికి చెందిన ఒక ట్రాక్టర్‌ను తలుపూరు క్రాస్ వద్ద పట్టుకున్నారు. అప్పట్లో విధుల్లో ఉన్న ఓ హోంగార్డు ద్వారా రూ.4 వేలు తీసుకుని వదిలివేసినట్లు సమాచారం. నాలుగు నెలల క్రితం తిరిగి అదే ట్రాక్టర్‌ను ఆత్మకూరులో పట్టుకున్నారు. దాని యజమానిపై కేసు నమోదు చేయడంతో పాటు కోర్టుకు హాజరు పరచడానికి 15 రోజులు తిప్పుకుని డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. సదరు పోలీసుపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే మరిన్న వాస్తవాలు బయటకు వస్తాయని స్థానికులు తెలియజేస్తున్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

సిపిఎం, ఎపి రైతుసంఘం నాయకులు

ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సిపిఎం, ఎపి రైతుసంఘం నాయకులు

పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి కొండారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దమట్లగొంది గ్రామంలో ఎండిపోయిన వేరుశనగ పంటను సిపిఎం, ఎపి రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమట్లగొంది గ్రామంల్లో రైతు రమేష్‌బాబు ఒక్కడే దాదాపు పదెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారన్నారు. పంట సాగు కోసం సుమారు రూ.4లక్షల వరకూ పెట్టుబడి అయిందన్నారు. దాదాపు నాలుగేళ్ల నుంచి ఇదే పరిస్థితి దాపురించిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతుకు నష్టపరిహారం అందజేయాలన్నారు. కాగా మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు ఎకరాకు రూ.40వేలు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల సహాయ కార్యదర్శి జయరాముడు, బాలరాజు, శ్రీనివాసులు, ఆంజనేయులు, సుంకన్న, రామాంజనేయులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

90శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

90శాతం సబ్సిడీతో రైతులకు పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2024 రబీలో పప్పుశనగ 25 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రకటించడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. పప్పుశనగ బయట మార్కెట్లో రూ.7వేల నుంచి రూ.7,300 వరకూ ఉందన్నారు. కానీ ప్రభుత్వం రూ.9400 ధర నిర్ణయించి 25శాతం సబ్సిడీ ఇస్తామనడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు. రైతులు పంటలుసాగు చేయాలంటే ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం సబ్సిడీ సవరించి 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న జెవివి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసున

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన-జిల్లావ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకుంటేనే మూఢనమ్మకాలకు అవకాశంలేని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించుకోవచ్చని జెవివి నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన సూచించారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కెఎస్ఆర్ బాలిక హైస్కూల్‌లో మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచం మొత్తం సైన్స్ చుట్టే తిరుగుతోందన్నారు. శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్న దేశాలే బాగా అభివృద్ధి చెందాయన్నారు. విద్యార్థులు కూడా తమలో తాముగా ఎందుకు, ఏమిటి, ఎలా అనే ప్రశ్నలు వేసుకోవాలన్నారు. అప్పుడే మీకు సరైన సమాధానం దొరుకుతుందన్నారు. విద్యార్థులకు చైతన్యంతో కూడిన శాస్త్రీయ పరిజ్ఞానం అందించాలనే దక్పథంతోనే జెవివి 30ఏళ్లుగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కెఎస్ఆర్ బాలిక హైస్కూల్ హెడ్‌మాస్టర్ జి.నారాయణ, చెకుముకి నగర కన్వీనర్ రామకృష్ణ, ఎస్.గాంగేనాయక్, అధ్యాపకులు ఎం.అరుణకుమారి, అంజాద్‌వలి, జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, నగర నాయకులు లక్ష్మీనారాయణ, తిరుపాలు, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, తిప్పేస్వామి, బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని మహర్షి దయానంద గురుకులంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను ఎపి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ ఉష, జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం. రంగన్న విడుదల చేశారు. పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు ఎపి బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెఇ.సురేష్‌గౌడ్ సమకూర్చిన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహర్షి దయానంద గురుకులం కరస్పాండెంట్ వేదమూర్తి, జెవివి జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, దేశాయి నాగరాజు, ఏపీ బీసీ ఫెడరేషన్ నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాస్ యాదవ్, శివ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : విద్యార్థులు బాల్య దశ నుంచే అన్నిరంగాల్లో ప్రావీణ్యం పొందాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథ్ సూచించారు. మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ మండలాలకు చెందిన విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహిక సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంధం శ్రీనివాస్, జెవివి నాయకులు మల్లికార్జున, కన్నేపల్లి చిత్తప్ప, కంబాల తిమ్మారెడ్డి, రాజన్న, మహేష్, నంజుండప్ప, వెంకటేష్, బసవరాజు, రూపేష్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జెవివి నాయకులు

ఉరవకొండ : మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీ కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.రిజ్వానా, పి.సాత్విక్, ఏ.హన్సిక, ప్రయివేటు పాఠశాలల్లో శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఎం.శిఖా, ఎస్ మహేష్, ఎ.భూమిక ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు జెవివి మండల అధ్యక్షులు టి.వెంకట్ తెలిపారు. విజేతలను మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, నాగమల్లేశ్, ఎస్‌కె ప్రభుత్వ హై స్కూల్ హెచ్ఎం మల్లికార్జున, తదితరులు అభినందించారు.

బ్రహ్మసముద్రం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ సజావుగా సాగిందని జెవివి మండల కన్వీనర్ చన్న మల్లప్ప తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు మండల స్థాయిలో పరీక్షలు రాశారన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయిలో నిర్వహించే టెస్టులో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్ఎం.చంద్రమౌళి, ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సురేష్, ఆనంద్‌రెడ్డి, నరసింహారెడ్డి, గౌతమి, ప్రమీల, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : డి.హీరేహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రామాంజనేయ సహకారంతో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌బాబు, రామాంజనేయులు ఆధ్వర్యంలో మండల స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థుల బృందం మొదటి స్థానాన్ని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెంచే లక్ష్మీనారాయణ, తాలూకా కార్యదర్శి జగదీష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణను సన్మానిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

సిపిఎం మండల కార్యదర్శికి పరామర్శ

ప్రజాశక్తి-గుత్తి

సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణను ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాంభూపాల్ మంగళవారం పరామర్శించారు. రామకృష్ణ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో వైద్య చికిత్సలు తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వి.రాంభూపాల్‌తోపాటు సిపిఎం నాయకులు బసినేపల్లి గ్రామానికి చేరుకుని పరామర్శించారు. రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వి.నిర్మల, పద్మా మండల కార్యదర్శి ఎన్.రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, నాయకులు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, ధనర్జన, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ముందస్తు దసరా సంబరాలు

సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, శ్రీచైతన్య సిబ్బంది

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజిఎం సుబ్బారెడ్డి పండుగ విశిష్టతను వివరించారు. దసరా హిందువుల ముఖ్యమైన పండుగ అన్నారు. శరద్రుతువులో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకూ అమ్మవారిని వివిధ రూపాల్లో కొలువుదీర్చి పూజించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు భారతి, మంజుల, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం రూరల్ మండలంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గత వైసిపి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి లేక పూర్తిగా కుంటుపడ్డాయని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో పలు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా గ్రామంలో డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా దళితవాడలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోందన్నారు. దీనికితోడు మురుగునీరు, తాగునీటి పైపుల్లో కలుషితమవుతోందని స్థానికులు విన్నవించగా అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శులను పిలిపించుకుని ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మల్లికార్జునరెడ్డి సమక్షంలో దాదాపు 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, టిడిపి మండల నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ తేజోష్ణ, ఇఒఆర్‌డి దామోదరమ్మ, పొడరాళ్ల రవీంద్ర, జొన్నా రామయ్య, బుల్లే నారాయణస్వామి, చిన్న ఆంజనేయులు, పిట్టు రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేసిన వృద్ధుడితో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

రక్తదానం సామాజిక బాధ్యత

జాతీయ రక్తదాన దినోత్సవంలో మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రక్తదానం చేయడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో రక్తదాతలను సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి నగరపాలక సంస్థ సిబ్బంది రక్తదానం చేస్తుండటం అభినందనీయమన్నారు. రక్తదానంతో ఒక జీవితాన్ని కాపాడటంతోపాటు వారిపై ఆధారపడ్డ కుటుంబం వీధిన పడకుండా నిలపవచ్చన్నారు. కావున ప్రతిఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్లు కమల్ భూషణ్, బాలాంజినేయులు, వైసిపి నాయకులు కుళ్లాయిస్వామి, ఇఇలు రాధాకృష్ణ, షాకీర్‌హుస్సేన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలతో మేయర్ వసీం, నాయకులు

గుత్తి : జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని ఎపి ఆదర్శ పాఠశాలలో పురస్కరించుకొని రెడ్ ప్లస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భవతులను ఉచితంగా ఆటోలో ఆసుపత్రికి తరలిస్తున్న ఆటో డ్రైవర్ షేక్‌నజీర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఓబులేసు, ప్రిన్సిపాల్ ఎన్. ఉష, బిజెపి నాయకుడు తెగదొడ్డి తిమ్మారెడ్డి, రెడ్‌ప్లస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షేక్షావలి, నాయకులు మాషీర్, శివ, బాషా, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : రక్తదానం సేవా కార్యక్రమం కాదని.. అది ప్రతి పౌరుడి బాధ్యత అని రెడ్‌డ్రాప్ అధ్యక్షుడు గులాం మహమ్మద్ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం రెడ్‌డ్రాప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గులాం మహమ్మద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్త నిధి కేంద్రంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 25 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవిత్ర ప్రజ్ఞ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు ఇస్మాయిల్, లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ రంజాన్, కారుణ్య హెల్పింగ్ హాండ్స్ సభ్యుడు సురేష్,రెడ్ డ్రాప్ కోశాధికారి మనోహర్, సభ్యులు మధు, సయ్యద్ రఫిక్, మురళీమోహన్, సుభాన్, ల్యాబ్ టెక్నీషియన్లు సత్య, ఉమా, రాజు తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామిడి సీఐ యుగంధర్, జెవివి రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటనారాయణరెడ్డి, అభయ బ్లడ్ డోనర్స్ అధ్యక్షులు షామీర్, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ పాఠశాలలో..

పుట్లూరు : మండల కేంద్రంలోని రాయలసీమ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినులు నవదుర్గ అమ్మవారి వేషాల్లో అలరించారు. తర్వాత విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపక బృందం, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి వేషధారణలో విద్యార్థినులు

'శ్రీబాలాజీ'లో ప్రాంగణ నియామకాలు

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో పివికెకె యాజమాన్యం

అనంతపురం : నగరంలోని రుద్రంపేట బైపాస్ ఆలమూరు రోడ్డులో ఉన్న శ్రీబాలాజీ ఎంసిఎ కళాశాలలో 24/7 ఎ1 వారు వాయిస్ అండ్ నాస్ వాయిస్ స్థానానికి ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ నియామకాల్లో 200 మంది విద్యార్థులు పాల్గొనగా 15 మంది ఎంపికయ్యారు. వీరిని బెంగుళూరులో పని చేసేందుకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్, డైరెక్టర్ పల్లె సింధూరారెడ్డి, ప్రిన్సిపాల్ సి.మన్మథేశ్వరరెడ్డి, తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఎంసిఎ విభాగాధిపతి కబీర్‌బాషా, ఎంబిఎ విభాగాధిపతి సర్ఫరాజ్ రహీమ్, పరిపాలనాధికారి ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-పుట్లూరు

రబీ సీజన్‌లో రైతులు సాగు చేసేందుకు 50 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురవక సక్రమంగా పంటలు సాగు చేయని నేపథ్యంలో కనీసం రబీలోనైనా పంటలు సాగు చేసేందుకు పప్పుశనగ విత్తనాలను 50 నుంచి 60 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి సత్తార్ గోపాల్, గౌరవాధ్యక్షులు టి.బాల గుర్రయ్య, ఉపాధ్యక్షులు చిన్నికృష్ణుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న కుల్లాయప్ప, మండల నాయకులు గోపాలకృష్ణ, రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి టి.ఓబుళయ్య, కమిటీ సభ్యులు అంకిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగమణీంద్ర, రైతులు అంజనప్ప, పెద్ద నరసింహులు, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గేట్స్ కళాశాలకు ఉత్తమ అవార్డు

అవార్డులతో గేట్స్ ప్రతినిధులు

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అరుదైన గౌరవం దక్కింది. ఏఐసిటిఈ, ఎడ్యు స్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలిండియా స్థాయి నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శన చేసి ర్యాంకుల్లో 13వ స్థానం కైవసం చేసుకుంది. సౌత్ సెంట్రల్ జోన్‌లో 2024 సంవత్సరానికి బెస్ట్ పర్ఫార్మింగ్ ఇంజినీరింగ్ కళాశాలగా గుర్తింపు లభించింది. ఢిల్లీలోని ప్రతినిధులతో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ కళాశాలకు గుర్తింపు అకాడమిక్ క్వాలిటీ, ఇన్నోవేషన్ల పట్ల అంకితభావాన్ని ఇచ్చాయన్నారు. అవార్డు రావడం గర్వ కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ

అనంతపురం : జెఎన్‌టియులో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి మంగళవారం యూనిఫారం, బెల్టులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, కన్సల్టెన్సీ డైరెక్టర్ పిఆర్.భానుమూర్తి సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. అంతేగాకుండా రోజూ తప్పనిసరిగా యూనిఫారం ధరించాలన్నారు. ప్రాంగణానికి ఇతర వ్యక్తులు, వాహనాల ప్రవేశాన్ని నియంత్రించాలన్నారు.

జెఎన్‌టియు సెక్యూరిటీ సిబ్బందితో విసి, అధికారులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్ లో ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి ప్రమాదాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులందరికీ సబ్సిడీతో పప్పుశనగ ఇవ్వాలి

బెళుగుప్ప : రబీ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులకు 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎపిబిహెచ్ రాయుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం కాకుండా ప్రతి రైతుకూ 90 శాతం సబ్సిడీతో పప్పుశనగ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు సేవాకేంద్రాల ద్వారా సబ్సిడీతో ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలన్నారు.

జాతీయస్థాయి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తరిమెల అమర్నాథ్‌రెడ్డి

అమర్‌నాథ్‌రెడ్డికి జాతీయ స్థాయి ప్రశంసాపత్రం

అనంతపురం కలెక్టరేట్ : 30 ఏళ్లుగా రక్తదానం చేయడంతోపాటు రక్తదానంపై చైతన్య కార్యక్రమాలు చేసినందుకు మానవతా రక్తదాతల సంస్థ ఛైర్మన్ తరిమెల అమర్‌నాథ్‌కు జాతీయ స్థాయి ప్రశంసాపత్రం వరించింది. మంగళవారం రాజస్థాన్ రాష్ట్రం, జైపూర్‌లో నిర్వహించిన రక్తదాన దినోత్సవ వేడుకల్లో కేంద్ర ఆరోగ్య శాఖ జాతీయ కార్యదర్శి డాక్టర్ అతుల్ గోయల్‌తో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కళ్యాణదుర్గం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పరిసరాల పరిశుభ్రతతోపాటు డ్రెయినేజీలను శుభ్రం చేశారు. అలాగే స్థానిక ఎస్విజియం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

చెన్నకేశవ అనాథాశ్రమ నిర్వాహకులకు సన్మానం

నార్పల : మండల పరిధిలోని కురగానపల్లి గ్రామంలో అనాథాశ్రమం నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి దంపతులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆపద్బాంధవ సహాయక సేవా సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అనాథాశ్రమ నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి దంపతులను సన్మానించారు.



చంద్రశేఖర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంపి

రైతులకు దానామృతం అందజేత

నార్పల/బుక్కరాయసముద్రం : నార్పల మండలంతోపాటు బుక్కరాయసముద్రం మండలాలకు చెందిన రైతులకు అధికారులు మంగళవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో దానామృతం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా బుక్కరాయ సముద్రం మండలం బొమ్మలాటపల్లి, బుక్కరాయసముద్రానికి చెందిన రైతులకు 3 టన్నులు, నార్పల మండలంలోని గడ్డం నాగేపల్లి, నడిమిదొడ్డి, కేసేపల్లి, నార్పల, గంగనపల్లి, గూగూడు, తదితర గ్రామాల రైతులకు 21,500కిలోల దానామృతాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఎవి.రత్నకుమార్, నార్పల వెటర్నరీ డాక్టర్ గోవిందరాజులు, గోపాలమిత్రాలు జయరాం, శివప్రసాద్, రాజారెడ్డి, రామ్మోహన్‌నాయుడు, ఎహెచ్ఎలు సురేష్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

దానామృతం లారీతో రైతులు

3న సమగ్ర సస్యరక్షణపై అవగాహన

ఉరవకొండ : ఉరవకొండలోని దేవాంగ కళ్యాణ మండపంలో ఈనెల 3న మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై జైకిసాన్ ఫౌండేషన్, రెడ్‌స్టార్ ట్రేడింగ్ కంపెనీ సహకారంతో అవగాహన కల్పించనున్నట్లు జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండ దేవాంగ కళ్యాణ మండపంలో గురువారం సాయంకాలం 4 గంటలకు మిరప రైతులకు మేలు రకమైన సాగు విధివిధానాలపై సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'గొంతు తెగిన అక్షరం' పుస్తకం ఆవిష్కరణ

పుస్తక రచయిత చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అతిథులు

బెలుగుప్ప : మండల పరిధిలోని శీర్పి గ్రామానికి చెందిన యువకవి చంద్రశేఖర్ రాసిన 'గొంతు తెగిన అక్షరం' పుస్తకాన్ని మంగళవారం విశాఖపట్నంలోని ఎవిఎన్ కళాశాలలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డివి.సూర్యారావు, సహదయ సాహితీ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్‌రెడ్డి, సుశర్ల సర్వేశ్వర శాస్త్రి, సహృదయ ప్రధాన కార్యదర్శి చినసూర్యనారాయణ, ఎవిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య, ఆశావర్కర్ల సమావేశం

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు శ్రీరామ్‌కుమార్, పరమేశ్వర్ అధ్యక్షతన మంగళవారం ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, శిశువులకు సంబంధించిన ఆర్‌సిహెచ్ సర్వీసులు, పెండింగ్‌లో ఉన్న పిఎంఇవై అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో ఎలా పొందుపరచాలనే విషయాలపై అవగాహన కల్పించారు. తర్వాత పిహెచ్‌సిలోని ల్యాబ్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచనలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిహెచ్‌ఓ జుబేదా, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్ గౌడ్, ఎఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చదరంగంలో జిల్లా క్రీడాకారుల సత్తా..

చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

అనంతపురం : ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా మంగళవారం విడుదల చేసిన చదరంగ క్రీడాకారుల జాబితాలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ జాబితాలో అనంతపురంలోని ఏ1 చెస్ అకాడమీ శిక్షకుడు, క్రీడాకారుడు గంతి మెహరాజ్ ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ రేటింగ్ విభాగంలో 1634, తాడిపత్రికి చెందిన అన్నాచెల్లెళ్లు పల్లినేని మోక్షిత్‌చౌదరి 1490, పల్లినేని హారికాచౌదరి 1492వ రేటింగ్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు, గౌరవ ఛైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి ఇంటూరి కిషోర్‌నాయుడు, తదితరులు క్రీడాకారులను అభినందించారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలు ఢీ..వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామ సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో బొమ్మన్న అనే వ్యక్తి మృతిచెందాడు. బొమ్మన్న, భార్యతో కలిసి గౌరసంద్రం మారెమ్మను దర్శించుకుని పాల్తూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొమ్మన్న మృతిచెందగా భార్య గాయపడింది. అలాగే మరో ద్విచక్ర వాహనంలో వచ్చిన వీరాపురానికి చెందిన ఆంజనేయులు గాయాలపాలయ్యాడు. క్షతగాత్రులను రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రధానోపాధ్యాయుడికి గాయాలు

అనంతపురం క్రైం : స్థానిక బళ్లారి బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రధానోపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ రఘు ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కూడేరు మండలం మర్తాడు జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న కె.నాగరాజు మంగళవారం విధులకు వెళుండగా లారీ తగిలింది. ఈ ప్రమాదంలో నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శింగనమల : మండల పరిధిలోని పి.జలాలపురం గ్రామంలో వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామస్తులు పోలీసులకు పట్టించారు. వివరాల్లోకి వెళ్తే.. పి.జలాలపురం గ్రామం వంక నుంచి రేయింబవళ్లు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇందులో భాగంగా గతరాత్రి ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం లోపలికి దూసుకెళ్లింది. దీంతో పెద్దగా శబ్దం రావడంతో గ్రామస్తులు మేలుకొని అడ్డుకున్నారు. వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. తర్వాత పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఏఎస్ఐ చితంబరయ్య సిబ్బందితో చేరుకుని ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో
బుక్కరాయసముద్రం పాఠశాల హెచ్‌ఎం వసుంధర, పీడీ

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దర్శన్‌తేజ పాఠశాల స్థాయి జూడో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ అండర్-19 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాలకు చెందిన సంతోష్, వివేక్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వసుంధర తెలిపారు. ఈమేరకు రాష్ట్ర, జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రహ్మసముద్రం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శివలింగమ్మ ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్స్ 1500 మీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో రెండవ స్థానం నిలిచి రాష్ట్రస్థాయికు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, పిఇటి ఇబ్రహీం తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక పాఠశాలల్లో విద్యార్థినిని అభినందించారు. ఈవిద్యార్థిని శ్రీకాకుళంలో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంతురెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామానికి చెందిన ఉమేష్ చంద్ర ఎంపికైనట్లు సర్పంచి మల్లెలు జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమేష్ చంద్ర చాబాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. క్రీడలపై ఉన్న ఆసక్తిని గమనించి వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శిక్షణ ఇవ్వగా స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచితోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రప్ప, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

పుట్లూరు : రాష్ట్రస్థాయి అండర్-19 స్టాఫ్‌బాల్ పోటీలకు సాయిసమీనా, రమాదేవి, గంగా హేమావతి, నాగప్రవిత, అండర్-19 బేస్‌బాల్ పోటీలకు అస్మితేజ, నెట్‌బాల్ పోటీల్లో కృష్ణకుమారి ప్రతిభ కనబరిచి రాష్ట్రపోటీలకు ఎంపికైనట్లు ఎస్‌ఒ మాధవి తెలిపారు. ఆయా విద్యార్థులు అనంతపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను ఎస్‌ఓతోపాటు ఉపాధ్యాయల బృందం అభినందించింది.

పుట్లూరు కెజిబివి విద్యార్థులతో ఎస్‌ఒ మాధవి

నేడు గ్రామసభ

అనంతపురం రూరల్ : మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4, 5వ తేదీల వరకూ గ్రామసభలు కొనసాగుతాయని, ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో సమర్పించాలని కోరారు.

యల్లనూరు : గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024-2025 సంవత్సరానికి నూతన పనులు గుర్తింపు ప్రణాళికలో భాగంగా బుధవారం నుంచి మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వీరరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 21 పంచాయతీల్లో సభలు జరుగుతాయన్నారు.

అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

జిల్లాలోని రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి (డిఎఒ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగలవారం మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో డిఎం అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం రబీలో సాగవుతున్న పప్పుశనగ, తదితర పంటలకు రైతులే పంటల బీమా సొమ్మును చెల్లించాలన్నారు. తర్వాత మొక్కజొన్న పంటను పరిశీలించి యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ మల్లీశ్వరి, డిఆర్‌సి ఎడిఎ శైలజాకుమారి, ఎడిఎ చెంగళరాయుడు, ఎఒ కాత్యాయిని, సర్పంచి ఫక్రుబి, డిఆర్‌సి ఎఇఒ ప్రసాద్, ఎఇఒ హరి, ఎంపిఇఒ సుధ, విహెచ్ఎ రవితేజ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని నీలూరు, తంబళ్లపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి లీలావసుంధర ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రాంతీయ పరిశోధన స్థానం ఎడిఎ వెంకటరాముడు, రేగులకుంట శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ భాస్కరరావు పత్తి, కంది, కొర్ర, తదితర పంటలకు సంబంధించి సూచనలు, సలహాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శ్రీనివాసరావు, విఎఎ చందన, రామాంజనేయులు, వెటర్నరీ అసిస్టెంట్ పద్మావతి, రైతులు దేవేందర్‌రెడ్డి, అశ్వర్థ, హరీష్, వెంకటేష్, జయన్న, గోపాల్‌రెడ్డి, జయరామ్‌రెడ్డి, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'లో ఉమామహేశ్వరమ్మ

పుట్లూరు మండలంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని తీటకల్లు, కన్నేపల్లి, విఎన్.హళ్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల పంటల సాగు, తెగుళ్లు, పురుగులు నివారణ, సేంద్రియ ఎరువులు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి సరిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల వ్యవసాయ అధికారి శుభకర్ ఆధ్వర్యంలో మండల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శుభకర్ ఇందులో భాగంగా వివిధ రకాల పంటల సాగు, తెగుళ్లు, పురుగులు నివారణ, సేంద్రియ ఎరువులు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనిమల్ హస్బండరీ డిప్యూటీ డైరెక్టర్ అనిమల్, హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య, వెటర్నరీ డాక్టర్ శ్రీవిద్య, రైతు సేవాకేంద్రం సిబ్బంది భీమేష్, రైతులు నెట్టెం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : సాగు చేసిన పంటలకు మేలు జరిగేలా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి మహేంద్ర సూచించారు. మంగళవారం మండలంలోని ఆవులదట్ల, జుంజురంపల్లి గ్రామాల్లో ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మహేంద్ర వివిధ పంటల్లో వచ్చే తెగుళ్లు, చీడ పురుగుల గురించి వివరిచారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిరికల్చర్ అధికారి రమణ, ఎఇఒ ఆంజనేయులు, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ, బి.పప్పూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి చిన్న వీరాస్వామి తెలిపారు. ఇందులో భాగంగా అరటి, చీనీ పంటల్లో ఏవిధంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన పంటల శాస్త్రవేత్త మాధవి, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, మార్కెటింగ్ విభాగానికి సంబంధించిన సుశీల, బొందలవాడ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

గుత్తిలో కేక్ కోస్తున్న వృద్ధులు

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి-గుత్తి

ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధుల దినోత్సవం ఘనంగా జరిగింది. అలాగే రఘుపతి వెంకటరత్నం నాయుడు జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, కార్యదర్శి కె.రామ్మోహన్, నాయకులు వెంకటసుబ్బమ్మ, విజయలక్ష్మి, ఈశ్వరయ్య, వెంకటేష్, నారాయణరెడ్డి, శామ్యూల్, హాసన్‌అహ్మద్ గోవిందప్ప, స్వామిదాస్, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పావని ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వృద్ధుల జీవన శైలి, వైద్య పరీక్షలపై గ్రామంలో ర్యాలీ నిర్వహినంచి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ.షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఫార్మాసిస్ట్ మంగమ్మ, ఎల్‌టి.రాణి, స్టాఫ్‌నర్స్, జినాతున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానికబళ్లారి రోడ్డులో ఉన్న రామకృష్ణ వృద్ధాశ్రమంలో మంగళవారం బెడ్‌షీట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు బాబు, బాల నరసింహులు ఫరీషా, విజయ్‌కుమార్, పాలరాజు, రఘు, లీలావతి, నాగమణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గ వృద్ధాశ్రయంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొనసాగిన 'స్వచ్ఛత హి సేవ'

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల స్పెషల్ ఆఫీసర్ బిఎన్.శ్రీదేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి తేజోష్ణ, వైద్యాధికారిణి బి.స్వాతిలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని శానిటేషన్ వర్కర్స్, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి దామోదరమ్మ, సిహెచ్ఒ మోహన్‌రావు, పిహెచ్ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ధనుంజయ, ఎంఎల్‌హెచ్‌పి గౌతమి, మణి యామిని, జ్యోతి, జయంతి, తదితరులు పాల్గొన్నారు..

బుక్కరాయసముద్రంలో కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుట్లూరు : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి కెజిబివి ఎస్‌ఓ మాధవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎద్దులపల్లి పిహెచ్‌సి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కార్మికులకు బీపీ, షుగర్, హెచ్‌బి, బ్లడ్ టెస్టింగ్, కంటి పరీక్షలు, తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, ఇఒఆర్‌డి శశికళ, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, పిహెచ్‌సి సూపర్‌వైజర్ సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్నకుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయ ఆవరణంలో సర్పంచి సుప్రియ, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి శైలజారాణి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ ఉదయాన్నే వీధులు శుభ్రం చేస్తూ, ప్రజల ఆరోగ్య పరిరక్షకులుగా నిలుస్తున్న పంచాయతీ కార్మికులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చరణ్, పరుశురాం, శ్రీనివాసులు, లక్ష్మేంద్ర, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు

నార్పలలో కార్మికులను సన్మానించిన అధికారులు